క్లుప్తంగా

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు దళిత వాడలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైంది. వెంకటేశులు పొలం వద్ద వ్యవసాయ అవసరాల కోసం 16కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున మంగళవారం గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి, ఇంధనాన్ని ఎత్తుకెళ్లారు. ఏఈ సదాశివన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంగ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

నింద్ర: మండలంలోని శ్రీరామ పురంలో బుధవారం తిరుపతి రాస్, శంకర్ నేత్రాలయం వారి ఆధర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పేదలకు కంటి పరీక్షలు చేసి వారికి కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. వైద్య శిబిరంలో 110 మందికి వైద్య పరీక్షలు చేశారు. అందులో 18 మందికి కంటి ఆపరేషన్లు ఎంపికైనట్లు తెలిపారు. వారిని చెన్నై తీసుకెళ్లి శస్త్రచికిత్సలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి రవి, వైద్యులు వేణు, మెంకటముని, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేడ దిబ్బల తొలగింపు



రోడ్డు పక్కనున్న పేడ దిబ్బలు తీస్తున్న అధికారులు

పాలసముద్రం: పరిసరాల శుభ్రతలో భాగంగా బుధవారం సర్పంచ్ లిల్లీ, పంచాయతీ కార్యదర్శి హరి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేడ దిబ్బలను జేసీబీ సాయంతో తొలగించారు. వెంగళరాజుకుప్పం పంచాయతీల్లో రోడ్డుకి ఇరువైపులా పేడ దిబ్బలు, ముళ్ల కంపల తొలగింపును మండల విస్తరణాధికారి రమేష్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్‌అంబాజిడర్లు ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

నగరి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అవగాహన కలిగించారు. నగరి పేట ప్రాంతాల్లో బుధవారం పర్యటించిన ఆయన అగ్నిప్రమాదాల నివారణ, మంటలను అదుపుచేసే ప్రక్రియలపైనా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కెబిబి ప్రతాప్, డిసి రాజు, ప్రవీణ్ కుమార్, విజయ్, మల్లికార్జున, కోటేశ్వరరావు, మధు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రతి అర్జీని పరిష్కరించాలి



ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే థామస్

పాలసముద్రం: మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ శ్యామలశివప్రకాష్ రాజు, ఎంపీడీఓ విద్యావతి, తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తెలిపారు. 117 వచ్చిన ప్రతి అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాజేంద్రన్, ఇందిరమ్మ, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దర్జాగా కబ్జా

- యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ
- అధికారాన్ని అడ్డుపెట్టుకుని రెచ్చిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- ఇళ్ల స్థలాల కోసం ఎస్సీల ఆరాటం



ఆక్రమణకు గురవుతున్న భూమి ఇదే



ఆక్రమిత భూమిలో రాతి కూసాలు నాటి వేసిన కంచె

వెదురుకుప్పం: అధికారాన్ని అడ్డుపెట్టుని తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. ఎక్కడైనా ఖాళీ జాగా కనిపిస్తే వెంటనే అక్కడ వాలిపోయి పాగా వేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎంచక్కా కబ్జాల పర్వాన్ని కొనసాగిస్తున్నా పట్టించుకునే దిక్కు లేదని ప్రజలు వాపోతున్నారు. రూ.లక్షలు విలువ చేసే భూములను కబ్జా చేస్తున్నా రెవెన్యూ శాఖ మాత్రం నిద్రావస్థలో ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఆక్రమణలను ప్రశ్నిస్తే పోలీసుల ద్వారా బెదిరింపులకు దిగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మండలంలోని ఆళ్లమడుగు సమీపంలో టీడీపీ నాయకులు చేస్తున్న కబ్జాల పర్వం ఇంతా అంతా కాదు. అధికారులు హెచ్చరిస్తున్నా ఖాతరు చేయకుండా దురాక్రమణకు పాల్పడుతున్నట్లు చెప్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణ

మండలంలోని ఆళ్లమడుగు రెవెన్యూలో ఆక్రమణల జోరు రోజురోజుకూ పెరిగిపోతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీకి చెందిన వారు చేస్తున్న ఆక్రమణలకు హద్దుల్లేకుండా పోతోంది. శ్రీనివాసపురం సమీపంలోని బ్లాక్ నంబర్ 158లో సుమారు వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఉన్నట్లు స్థానికులు చెబున్నారు. ఇందులో 435–2 సర్వే నంబర్‌లో 2.87 ఎకరాల భూమిని ఎనమలమందకు చెందిన శ్రీరాములు రెడ్డి పేరిట డి పట్టాను గతంలో ఇచ్చారు. అయితే దీనికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిపై ఆయన కన్నుపడింది. ఎలాగైనా ఆక్రమించుకుని స్వాధీనం చేసుకోవాలని పూనుకున్నాడు. ఈ నేపథ్యంలో స్థానిక రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని ఆక్రమణలకు తెరలేపాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ భూమిని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నాలు చేశాడు. స్థానిక టీడీపీ నాయకుల అండదండలతో భూమిని కాజేయాలని చూశాడు. రాత్రి పూట జేసీబీల ద్వారా చదును చేసుకుంటున్నాడు. ఇదిలా ఉండగా వారం రోజుల నుంచి పట్టా భూమితోపాటు ఆక్రమించుకుంటున్న భూమి చుట్టూ రాతి కూసాలు నాటి ఫెన్సింగ్ వేసుకుంటున్నాడు. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఆక్రమణ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం శూన్యం. ఈ భూమికి పక్కనే ఎస్టీలకు ఇళ్ల పట్టాలు సైతం ఇచ్చినా వారిని బెదిరించి ఆ స్థలాన్ని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాడు. గతంలో తూకిఆకులు వేసుకుంటున్న బండను సైతం కబ్జా చేసుకున్నాడు. ఆక్రమించుకున్న భూమికి సంబంధించి తనకు పట్టా ఇవ్వాలని రెవెన్యూ సదస్సుల్లో అర్జీ ఇవ్వడం కొసమెరుపు. ఈ అర్జీని పరిశీలించిన రెవెన్యూ అధికారులు ఫిబ్రవరి 15న శ్రీరాములు రెడ్డికి నోటీస్ ఇచ్చారు. పట్టా పొందేందుకు నీకు ఎలాంటి అర్హత లేదని ఆ నోటీసు ద్వారా సూచించినా అనధికారికంగా ఆక్రమిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.



ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతున్న ఎస్సీ కుటుంబాలు

ఎస్సీలకు ఇళ్ల స్థలాలు లేక అవస్థలు

శ్రీనివాసపురం ఎస్టీ కాలనీ సమీపంలోనే యనమలమంద ఎస్సీ కాలనీ ఉంది. ఈ కాలనీలో చాలా మందికి ఇళ్ల స్థలాల్లేక ఇరుకు స్థలాల్లో కుటుంబాలను నెట్టుకొట్టుస్తున్నారు. ఇళ్ల స్థలాల కోసం గతంలో పలుమార్లు అర్జీలు సమర్పిస్తున్నా అతీగతీ లేదు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి అర్హత ఉన్న ఎస్సీలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మేము పేదలం. మాకు సౌకర్యవంతమైన నివేశ స్థలాలు లేవు. పూరిపాకల్లోనూ దుర్భర జీవితాలను గడుపుకుంటున్నాం. ఇక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడి ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి. అధికారులు స్పందించాలి.

–గోవిందయ్య, యనమలమంద ఎస్సీ కాలనీ

అడ్డుకుంటే బెదిరింపులు



ఎలాంటి అనుమతి లేకనే ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వారిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నా తమపై బెదిరింపులకు దిగుతున్నారు. టీడీపీ నాయకుల అండతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లో, సెలవు దినాల్లో రాతి కూసాలు నాటి ఆక్రమించుకుంటున్నారు.

–జయప్రద, యనమలమంద

సర్వే చేసి చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకుంటాం. సర్వే చేసి శ్రీరాములురెడ్డికి ఇచ్చిన పట్టా ప్రకారం ఎంత భూమి ఉందో నిర్ధారించి కేటాయిస్తాం. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైతే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. సర్వే చేసి ప్రభుత్వ భూమి ఆక్రమణ జరగకుండా చర్యలు తీసుకుంటాం.

–బాబు, తహసీల్దార్, వెదురుకుప్పం

నోటీస్ బోర్డు

నేడు భూ రీసర్వేపై సదస్సు

విజయపురం: మండలంలోని కాళికాపురంలో గురువారం ఉదయం 11 గంటలకు, గంగమాంబాపురం గ్రామంలో 12 గంటలకు భూ రీసర్వేపై రైతులకు అవగాహన సదస్సు ఉంటుందని తహసీల్దార్ ఎస్ కిరణ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు సంబంధించిన భూముల్లో ఏవైనా సమస్యలు ఉంటే ఈ కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చి భూ సమస్యను పరిష్కరించుకోవాలని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అక్రమ కుళాయిల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

విజయపురం: మండలంలోని కోసలనగరం గ్రామంలో అక్రమ కుళాయిలను తొలగించాలని ఏఈ హరిప్రసాద్ సచివాయల సిబ్బందికి సూచించారు. కోసల నగరంలో పర్యటించి, తాగునీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. లీకేజ్ పైపులను తొలగించి, పైపులైన్ ఏర్పాటు చేశారు. 'తాగునీటికి కట కట' అనే శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఏఈ స్పందించి కోసలనగరంలో తాగునీటి సమస్యను తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు.

క్వారీ పరిశీలన

విజయపురం: మండలంలో జరుగుతున్న క్వారీలను తహసీల్దార్ కిరణ్ పరిశీలించారు. 'రాత్రిళ్లు గ్రావెల్ తరలింపు' అనే శీర్షికన సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ కిరణ్ స్పందించారు. మండలంలోని మహారాజపురం, జంబాడ క్వారీలను బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా కుటుంబాలు ఉన్నాయని, రాత్రి పూట లారీలు తిరగడం వల్ల స్థానిక ప్రజలకు ఇబ్బందిగా ఉంటుందని సూచించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు తగ్గ కృషి చేయాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి సూచించారు. కళాశాలలో బుధవారం కెరీర్ సంసిద్ధత అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ లక్ష్యాలను నిర్దేశించుకొని అందుకు తగ్గట్టుగా తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. వన్ మిలియన్ ఫర్ వన్ బిలియన్ ఫౌండేషన్ మేనేజర్ శృతి మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఉత్పత్తి, సేవారంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఫైనాన్స్, అకౌంటింగ్, మార్కెటింగ్, హ్యూమన్ రీసోర్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి విభిన్న రంగాల్లో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ బలహీనతలను గుర్తించి, వాటిని అధిగమిస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వి.వీరయ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా సంకటహర చతుర్థి



ప్రత్యేక అలంకరణలో వరసిద్ధి వినాయక స్వామి

పుత్తూరు: పట్టణంలోని జెండామాను వీధిలో వెలసిన శ్రీశెల్వి వినాయక స్వామి ఆలయంలో బుధవారం రాత్రి సంకటహర చతుర్థి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామినికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించారు. అనంతరం మహిళలచేత సంకటహర చతుర్థి వ్రతాన్ని నిర్వహించారు. బిల్వ పత్రాలు, తెల్లజిల్లేడు పువ్వులు, గరికపోచలను సమర్పిస్తూ వేయి నామాలతో గణపతిని పూజించారు. బెల్లంతో చేసిన ఉండ్రాళ్లను నివేదించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గర్భిణులకు పోషకాహారం తప్పనిసరి



పోషణ్ పఖ్వాడ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు

పాలసముద్రం: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీసీ సూపర్‌వైజర్ అనురాధ తెలిపారు. వెంగళరాజుకుప్పం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పఖ్వాడా కార్యక్రమం నిర్వహించారు. అనురాధ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పోషకాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఆకుకూరలు, కూరగాయలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే రక్తహీనత లేకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే ఫుడ్‌ను తీసుకోవాలని, వీటి వల్ల అనేక రకాలైన లాభాలు ఉన్నాయన్నారు. బయట విక్రయించే ఫుడ్ న్యూడిల్స్, ఎగ్‌రైస్, గోబి రైస్ వంటి ఫాస్ట్‌ఫుడ్‌లలో వెనిగర్, టేస్టింగ్ సాల్ట్ కలవడంతో ఆరోగ్య సమస్యలు వస్తాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

మాజీ మంత్రికి సత్కారం



రోజాను సత్కరిస్తున్న మున్సిపాలిటీ నాయకులు, కార్యకర్తలు

నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా మాజీ మంత్రి ఆర్కేరోజాను మున్సిపల్, మండల నూతన కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు సత్కరించారు. ఆమె నివాసం వద్దకు బుధవారం వెళ్లిన వారు గజమాలలతోను, శాలువలతోను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ జగనన్న ఇచ్చిన బాధ్యతను స్వీకరించి పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, రూరల్ మండల అధ్యక్షులు రమేష్‌రెడ్డి, తిరుమలరెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, ఉపాధ్యక్షులు పళని, గోవర్ధన్, ప్రధాన కార్యదర్శులు ఎస్.ఆనందరెడ్డి, జగదీష్‌రెడ్డి, పురుషోత్తం, కార్యదర్శులు శేఖర్, మస్తాన్, దేవరాజులురెడ్డి, రామచంద్రారెడ్డి, బాలాజి, పార్టీ నాయకులు గణపతిశెట్టి, డింపుల్, గోవర్ధన్, హరి, శేఖర్, రాజేంద్ర, కృష్ణయ్య, సురేష్, భాస్కర్, దేవ మండడి, కె.మధు, జ్ఞాన, మురగయ్య పాల్గొన్నారు.



మాజీ మంత్రిని సన్మానిస్తున్న అగరం గ్రామ నాయకులు

మాజీ మంత్రితో అగరం నాయకులు

నింద్ర: మండలంలోని అగరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం నగరిలో మాజీ మంత్రి రోజాను కలిశారు. గ్రామానికి చెందిన బాలాజీకి మండల స్థాయిలో కమిటీ మెంబరుగా పార్టీ నియమితులైన సందర్భంగా మాజీ మంత్రిని కలిసి సన్మానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు ముమ్మరం



పేడదిబ్బలను తొలగిస్తున్న జేసీబీ

విజయపురం: మండలంలోని ఇల్లత్తూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేంద్రకుమార్ జేసీబీ సాయంతో పేడ దిబ్బలు, ముళ్ల పొదలను తొలగించారు. మురుగు నీటి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. అనంతరం పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పొడి, తడి చెత్తను వేరు చేసి, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామానికి దూరంగా పేడదిబ్బలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

యాదమరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీవో వేణు చెప్పారు. ఆయన బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికి గాను ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పండ్లతోటల పెంపకంపై దృష్టి సారించామన్నారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరగనున్న మహా భారత ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అనంతరం సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం చేశారు. ఆలయంలో బుధవారం నుంచే ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తారక్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం భాగవతారిణి మధులతచే హరికథ కాలక్షేపం ఉంటుందన్నారు. ప్రతి రోజూ రాత్రి శ్రీ వెంకటేశ్వర కళా నాట్యమండలి ఆధ్వర్యంలో వీధి నాటక ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

కోలాహలంగా కొల్లాగుంట జాతర



గ్రామ వీధుల్లో ఊరేగుతున్న గంగమ్మతల్లి

కార్వేటినగరం: మండల పరిధిలోని కొల్లాగుంట గ్రామంలో ఉన్న నడివీధి గంగమ్మ జాతర బుధవారం కోలాహలంగా ముగిసింది. మహిళలు ఆనవాయితీ ప్రకారం పడివేటమ్మ ఆలయం వద్ద పొంగళ్లు వండి పిండిదీపాలతో నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి కనక మేడాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో వెలసిన నడివీధి గంగమ్మను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో మేళ తాళాల మధ్య అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో భాగంగా మహిళలు వెయ్యి కళ్లదుత్తలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. యువత వివిధ రకాల వేషధారులతో చూపరులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అరగొండలో వైభవంగా విమానోత్సవం



విమానోత్సవంలో కోదండరామస్వామి

తవణంపల్లె: మండలంలోని అరగొండలో వెలసి ఉన్న శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి విమానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు ఆలయంలో మూలవిరాట్ సీతా రామలక్ష్మణులకు అభి షేకం చేశారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యం సమర్పించి భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రిలో ఉభయదారులచే విమానోత్సవాన్ని భక్తిప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి సుగంధపరిమళ పుష్పాలు, గజమాలలు, ప్రసాదాలు, పట్టు వస్త్రాలను మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తులకు అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన విమానంలో సీతాసమేతశ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను మైమరపించారు. భక్తులు ఇంటింటా స్వామికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో 17న గురువారం ఉదయం సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు, రాత్రిలో మహాసుదర్శన హోమం, వసంతోత్సవం, పట్టాభిషేకం ఉంటుందని కార్యనిర్వహకులు తెలిపారు.